


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

NOVEMBER 2006

సంవత్సర చందా రూ. 50/-

## సంక్షిప్తవార్తలు

2006 అక్టోబర్ 7వ తేదీ శనివారమునాడు పిఠాపురం అగ్రహారం మెటల్ వీధిలో జరిగిన సువార్త కూటములో అమెరికా నుండి వచ్చిన రాబర్ట్ స్వెయిన్ గారు వాక్యపరిచర్య చేసిరి. ఆయన తన 6సంవత్సరముల కుమారుడు జేమీతోను, సతీమణి మికాల్ తోను ఆ ప్రాంతమును దర్శించిరి. తత్ఫలితముగా ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అగ్రహారం మెటల్ వీధిలో సోదరుడు చినబాబుగారు పరిచర్యచేయుచున్నారు.

అక్టోబరు 8వ తేదీనాడు కిష్టాపురంలోను, 10వ తేదీనాడు ప్రత్తిపాడు, బలభద్రపురంలోను, 10వ తేదీనాడు Z.రాగంపేటలోను, 11వ తేదీనాడు తొండంగిలోను గోరింటలోను రాబర్ట్ స్వెయిన్ గారు వాక్యపరిచర్యచేసిరి. కిష్టాపురంలో D. ప్రసాద్ గారు ప్రత్తిపాడులో జి.హానోకు గారు, బలభద్రపురంలో బంగారు జోసఫ్ గారు రాగంపేటలో మల్లవరపు జోసఫ్ గారు, తొండంగిలో జి.యోహాను గారు, తదితర్లు సువార్తసేవ చేయుచున్నారు. గోరింటలోను, చదలాడలోను సోదరులు యమ్. ప్రేమ్ కుమార్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. ఈ గ్రామములన్నిటికి రాబర్ట్ స్వెయిన్ గారితో పాటు రిక్కీ గూటం గారు వెళ్లి సువార్తలో సహాయపడిరి. ఇంచుమించు ప్రతి గ్రామములోను స్త్రీలు, పురుషులు క్రీస్తు సువార్తకు లోబడి క్రీస్తుసంఘముతో చేర్చబడిరి. అక్టోబర్ 12వ తేదీ నాడు రాబర్ట్ స్వెయిన్ దంపతులు బెంగళూర్‌కు ప్రయాణించిరి.

2006 అక్టోబరు 7వ తేదీ శనివారం రాత్రి రాబిన్ గూటం గారు ఉద్యోగ రీత్యా ఆస్ట్రేలియాకు ప్రయాణమై 8వ తేదీ ఆదివారమునాడు అక్కడకు క్షేమముగా చేరుకొనిరి. రాబిన్ గూటం గారు ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేయుచున్నారు.

2006 అక్టోబర్ 20వ తేదీ శుక్రవారం అమెరికా సోదరులు జిమ్ ట్రోటర్,

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 27 | నవంబర్ 2006 | సంచిక 4


## విజ్ఞాన శాస్త్రము - బైబిలు -3
*(The Bible and Science)*

ఆధనిక విజ్ఞానశాస్త్రముతో బైబిలు ఏకీభవించుట లేదని చెప్పువారి వాదనలను తిరస్కరించుచు బైబిలు గ్రంధము నిజానికి మానవ విజ్ఞానము నకు ఎంతో ముందున్నది యని గత కొద్ది సంచికలలో చూచి యుంటిమి, చారిత్రక విషయాల్లో బైబిలున్నంత యధార్ధముగా మరొక పురాతన గ్రంధ మేమియును లేదు. బైబిలులో చెప్ప బడిన విజ్ఞాన శాస్త్ర విషయాలు ఎన్నో సత్యములని ఇంతవరకు మనము చూచుకొనివచ్చాం. ఈ సంచికలో కూడ బైబిలు లోని మరికొన్ని వైజ్ఞానిక సత్యములను కైకెత్తి చూపించుటకు ప్రయత్నించెదము.

ఆధునిక జీవశాస్త్రము (Biology) జీవనోత్పత్తిని గూర్చి చెప్పునపుడు జీవన ప్రమాణమునందు వృక్షాదులను అడుగుననుంచుచున్నది. నేటి విజ్ఞాన శాస్త్రము భూమిపై మొదట వృక్షాదులు,

అటుపిమ్మట జలచరములు, పక్షులు, వివిధరకములైన జంతువులు ఉద్భవించెనని, వాటన్నిటికంటె ఉత్కృష్ట జీవిగ మానవుడు పరిణామము జెందెనని చెప్పుచున్నది. ఆదికాండము మొదటి అధ్యాయములో నేటి శాస్త్రజ్ఞుల వలె మోషేకూడ అదే క్రమప్రకారము జీవనోత్పత్తిని గూర్చి వ్రాసి యున్నాడు. మోషే ప్రకారము మూడవదినమున వృక్షాదులు భూమిపై సృష్టింపబడెను. అయిదవ దినమున మొదట జలచరములు వాటి తరువాత దేవుని స్వరూపమందు మానవుడు తయారు చేయబడెను. దీనిని బట్టి ఆధునిక జీవశాస్త్రము మోషే వ్రాసిన సృష్టి క్రమముతో ఏకీభవించుచున్నట్లు మనము చూడగలము. అయితే జీవరాసులు పరిణామము (Evolution) జెంది జన్మదశ నుండి ఉత్కృష్ట దశకు మారుట వలన వివిధ జాతులు కలిగినవని శాస్త్రజ్ఞులు, వివిధ జాతులు సృష్టి ప్రకారము క్రమముగ సంపూర్ణమైనవిగా కలిగెనని మోషేయును చెప్పుటచే వీరిద్దరికి ఇక్కడ మాత్రమే వ్యత్యాసము కన్పడుచున్నది. అయితే పరిణామ సిద్ధాంతము ఇప్పటికింకను నిరూపింపబడలేదను సంగతి నేను మీకు గుర్తుచేయనవుసరము లేదనుకుంటాను. నిజానికి గౌరవ ప్రతిష్టలు కలిగిన విజ్ఞాన శాస్త్రవేత్తయెవడును పరిణామ సిద్ధాంతము యథార్థమని ఒప్పుకొనడు. అందువలన ఈ భూమిపై లక్షలకొలది యున్న ప్రాణులన్నిటిని దేవుడు సృష్టించెనని నమ్ముట ఎంతో ఉత్తమమైనది.

మన చుట్టుయున్న వాతావరణము సూక్ష్మజీవులతో నిండియున్నదని ఈ మధ్యనే శాస్త్రవేత్తలు కనుగొనిరి. ఈ సూక్ష్మజీవుల వలన మానవులకు అనేక విధములైన రోగములు సంభవించుచున్నవనుటను ఈరోజుల్లో ఎవరును కాదనరు. డాక్టర్లు ఒక రోగికి ఆపరేషన్ చేయవలసి వచ్చినపుడు, వారు గాయముచేయు చోటును సూక్ష్మజీవులు లేకుండా పరిశుభ్రము (Sterilise) చేతురు. నర్సులు, డాక్టర్లుకూడ తమ చేతులకు తొడుగులు (Gloves) ధరించుకొందురు. తమ నాసికా రంధ్రములపై నొక బట్టను కప్పుకొందురు. పరిశుభ్రము చేయబడిన

దుస్తులను ధరింతురు. ఆ జాగ్రత్త లన్నియు ఎందువలన? వైద్యుని చాకుతో తెరవబడిన రోగి శరీరములోనికి ఏవిధమైన క్రిములు ప్రవేశింపకుండు నిమిత్తము ఇట్టి జాగ్రత్తలు అత్యవసర మని నేటి వైద్యులు మనకు తెలియ జేయుదురు. అయితే కొన్నివేల సంవత్సరముల క్రితమే కొందరు రోగులు ఇట్టి విధమైన జాగ్రత్తలు తీసికొనవలెనని మోషే ఆజ్ఞాపించెను. లేవీకాండము 13:45లో అతడిట్లు వ్రాసెను: "కుష్టరోగి వస్త్రములను చింపివేయ వలెను; వాడు తల విరియబోసుకొన వలెను; వాడు అపవిత్రుడు గనుక ప్రత్యేకముగానే నివసింపవలెను; వాని నివాసము పాళెమునకు వెలుపల ఉండవలెను". మోషే ఒక విజ్ఞాన శాస్త్రజ్ఞుడు కాదని శాస్త్రజ్ఞులే ఒప్పు కొందురు. అయితే సూక్ష్మజీవుల నుండి తీసికొనవలసిన జాగ్రత్తలను గూర్చి అతడు వ్రాసినది ఖచ్చితముగా వైజ్ఞానిక సత్యమని అందరు అంగీకరింతురు. ఆధునిక వైద్య జ్ఞానము ప్రబలముందే మోషే ఈ సంగతిని వ్రాయగా అతనిచే దానిని వ్రాయించిన దెవరు? దేవుడే గదా!

వందలకొలది సంవత్సరములు తరబడి, మానవుల రక్తము, జంతువుల రక్తము ఒక్కటేయని మానవులు భావించిరి. అయితే నేటి విజ్ఞాన శాస్త్ర పురోగమనమునుబట్టి రక్తపరీక్షచేయు పరికరములు, పద్ధతులు కనుగొనబడినవి. దీనిని బట్టి ఏదైనా రక్తము ఒక జంతువుదో లేక మానవునిదో పరీక్ష చేసి శాస్త్రజ్ఞులు సులభముగ చెప్పగలరు. గాని వారు మానవరక్తము పరీక్షించి అది నల్లవానిదో లేక తెల్లవానిదో తెలియ జెప్పలేరు. అయితే అపో.పౌలు 2000 సం॥ల ముందే, "యావద్భూమి మీద కాపురముండుటకు దేవుడు ఒకని రక్తమునుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించెను" అని అపో.కా. 17:26లో తెలియజేసెను. అపో.పౌలు మానవుల రక్తపరీక్ష చేసి ఈ మాటను పలికెనా? లేక దేవుని పరిశుద్ధాత్మావేశము వలన పలికెనా? బైబిలు గ్రంథము పరిశుద్ధ దేవుని గ్రంథమనుటకు నీకు యింకా ఏమైనా ఋజువులు కావలెనా?

అనేక సంవత్సరములు వరకు మానవుని ప్రాణము దేనిలో ఇమిడి యున్నదో మానవులు ఎరుగరు. క్రీ॥శ॥

18వ శతాబ్దము వరకును దీని విషయమైన సత్యము వారికి బయల్పరచబడలేక పోయెను. గాని నేటి వైద్యులు ఒక ప్రాణిని కాపాడవలెనంటే రక్తము యొక్క ప్రాముఖ్యత ఎంతో యెరుగుదురు. అందువలననే ప్రమాదస్థితిలోయున్న వారికి వారు రక్తమును ఎక్కించెదరు. మానవుడు అంగహీనుడై జీవించగలడు గాని రక్తహీనుడై జీవించలేడు. రక్తమే ప్రాణమునకు ఆధారమని ఈ మధ్యనే మానవులు కనుగొన్నారు గాని రక్తము యొక్క విలువను గూర్చి మోషే కొన్ని వేల సంవత్సరములు క్రితమే బైబిలు నందు వ్రాసెను: "మాంసమును దాని రక్తముతో మీరు తినకూడదు; రక్తమే దాని ప్రాణము" అని ఆది.కా. 9:4లో అతడు వ్రాసెను. అయితే ఈ సంగతి మోషేకు ఎట్లు తెలియును?

మనుష్యుని శరీరమే ఒక ఆశ్చర్యకరమైన బైబిలు సత్యమును బయలుపరచుచున్నది. మానవ శరీరములో యున్న ప్రతి విధమైన రసాయనికములు, ఖనిజములు అన్నియు భూమిలో యున్నవి. అయితే మనుష్యుని శరీరము మట్టి సంబంధమైనదని బైబిలులో కనుగొనువరకు మానవులకు ఆ సంగతి తెలియదు. కాని శాస్త్రజ్ఞులు ఏమైతే సత్యమని కనుగొన్నారో ఆ సంగతినే బైబిలు వందలకొలది సంవత్సరములు నుండి బోధించుచున్నది. "దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి, వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" అని బైబిలు ఆది.కా. 2:7లో చెప్పుచున్నది. దీనిని బట్టి నరుని శరీరము మంటి నుండి చేయబడెనని గోచరమగుచున్నది. అటు తరువాత మొదటి మానవుడు పాపము చేయగా, "నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమటకార్చి ఆహారము తిందువు; ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నై పోదువని" దేవుడతనితో చెప్పెను (ఆది.కా. 3:19).

గనుక మిత్రులారా, ఈ జగత్తును, అందలి సమస్తమును నిర్మించిన గంభీర దేవుని యొక్క జ్ఞానము కొంత మాత్రమే బైబిలునందున్నది. అందువల్లనే మానవ జ్ఞానమున కందనటువంటి అనేక

చెప్పుచున్నది. బైబిలు అన్ని విషయముల లోను సత్యమని మీరు నమ్మడి. అప్పుడు మీరు ధన్యులగుదురు. అందువల్లనే భక్తుడైన దావీదు ఇట్లు వ్రాయుచున్నాడు: "దుష్టుల ఆలోచన చొప్పున నడువక పాపుల మార్గమున నిలువక, ఆపహాసకులు కూర్చుండు చోటను కూర్చుండక యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును. అతడు చేయున దంతయు సఫలమగును. దుష్టులు ఆలాగుననుండక గాలి చెదర గొట్టు పొట్టువలె నుందురు. కాబట్టి న్యాయ విమర్శలో దుష్టులును, నీతిమంతుల సభలో పాపులును నిలువరు. నీతిమంతుల మార్గము యెహోవాకు తెలియును, దుష్టుల మార్గము నాశనమునకు నడుపును" (కీర్తన 1).

మానవులను పాపమునుండి మరల్చి రక్షణ నొనంగుటయే బైబిలు ముఖ్యోద్దేశము. పాపులను రక్షించుటకే యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. నీవు ఆయనే దేవుడని, దేవుని కుమారుడని నమ్మి, నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది, ఆయన నామమును ఒప్పుకొనుచూ, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల రక్షించబడుదువు.

**- జాషువా గూటం**


క్రీస్తు సంఘములు సమర్పించుచున్న **'సత్యవాణి'** టి.వి.

కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు

**మాటి.వి.**లోను మరియు ప్రతి గురువారం ఉదయం 7:00 గం॥లకు

**'విస్సా'** ఛానల్ లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30

గం॥లకు **తేజ** ఛానల్ లోను చూడండి.

# సంఘపాలనపద్ధతి
## (Organisation of the Church)

క్రీస్తు సంఘమును స్థాపించెను (మత్తయి 16:18). లోకములో నుండి సువార్త వలన పిలువబడిన వారందరితో అదిసమ కూడి యున్నది (కొలస్స 1:13,14). రక్షింపబడిన వారితో అది సమకూర్చ బడినది (అపో.కా. 2:47). అది క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమైయున్నది (కొలస్స 1:18). అది ఒక్కటే ఒక్కటి యున్నది(ఎఫెసీ 4:4).

సంఘము సార్వజనికమైనది. వేలకొలది స్థానిక సంఘములతో అది సమకూడినది. అయితే ప్రతిస్థానిక సంఘము వ్యక్తిగత సభ్యులతో సమకూర్చ బడినది. అందువలన సంఘ ప్రభుత్వము స్థానికమేగాని అది జాతీయము గాని, అంతర్జాతీయముగాని కాదు. వేరొక మాటలో ప్రభువు సంఘమునకు భూలోక సంబంధమైన అధికారిగాని, ముఖ్యకేంద్రముగాని లేదు.

క్రీస్తే సంఘమునకు శిరస్సై యున్నాడని లేఖనములు బోధించు చున్నవి. ఈక్రింది వచనములను మనము గమనించుదము: "మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపు చున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22,23). "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23). "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" (కొలస్స1:18). ఈ వచనములన్నియు ఏమి బోధించు చున్నవి? సంఘము అను శరీరమునకు క్రీస్తే శిరస్సు అని చెప్పబడి యున్నది. అయితే ఎన్ని శిరస్సులున్నవి? ఒక్కటి మాత్రమే. అది క్రీస్తు మాత్రమే అయి యున్నాడు. ఇతరులెవరితోను ఆయన పంచుకొనలేదు.

అనేక స్థానిక సంఘములతో కూడిన సంఘమునకు క్రీస్తు శిరస్సై యున్నాడు. గనుక ఆయన ప్రతి స్థానిక సంఘమునకు, ప్రతి స్థానిక సభ్యునికి శిరస్సై యున్నాడు. దీనికి అనుగుణముగా పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, స్త్రీకి శిరస్సు పురుషుడనియు, క్రీస్తునకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను"(1కొరింథి 11:3).

ప్రతి స్థానిక సంఘము (Local Congregation) స్థానిక పరిపాలనను కలిగియుండవలెను. క్రీస్తు శిరస్సు అయియుండగా, సంఘము యొక్క ఆత్మీయ,శారీర అవుసరములను తీర్చుట కొరకు, సభ్యులలో నుండి పెద్దలు, పరిచారకులు నియమింపబడవలెను. సభ్యుల ఆత్మలను పెద్దలు సన్మార్గమున నడిపించవలెను (హెబ్రీ13:7). పరిచారకులయితే భౌతిక అవుసరములను సరిదిద్దవలయును (అపొ.కా.6). ప్రతి స్థానిక సంఘము లోను పెద్దలు, పరిచారకులు అని బహువచనమునే లేఖనములు బోధించుచున్నట్లు గమనించుము. దీనిని బట్టి సంఘములో ఒక్కడే పెద్దగాని, పరిచారకుడుగాని ఎన్నడు ఉండరాదు అని అర్థమగుచున్నది. ఒక స్థానిక సంఘ పెద్దలు, పరిచారకులు మరియొక సంఘముపైనిగాని, సంఘములపైని గాని అధికారమును చెలాయించరాదు. సంఘములయితే ఒకరితో నొకరు సహవాసము కలిగియుండవలెను గాని, ఒకదానిపై నొకటి అధికారము చెలాయించరాదు.

సంఘ పెద్ద (Elder),కాపరి,(Pastor) అధ్యక్షుడు(Bishop) మరియు ప్రెస్బిటర్ (Presbyter) అను పదము లన్నియును ఒకే పదవిని సూచించుచున్నవి. 1తిమోతి 3:1-7లో పౌలు అనేక అర్హతలను సూచించెను: "ఎవడైనను అధ్యక్ష పదవిని ఆశించిన యెడల అట్టివాడు దొడ్డపనిని అపేక్షించుచున్నాడనుమాట నమ్మదగినది. అధ్యక్షుడగువాడు నిందారహితుడును, ఏకపత్నీ పురుషుడు, మితానుభవుడును స్వస్థబుద్ధి గలవాడును, మర్యాదస్థుడును, అతిథి ప్రియుడును, బోధింపతగినవాడునై యుండి, మద్యపానియు, కొట్టువాడును కాక, సాత్వికుడును,

జగడమాడని వాడును, ధనాపేక్ష లేని వాడునై సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరుచుకొనుచు, తన యింటివారిని ఏలనేరకపోయిన యెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును? అతడు గర్వాంధుడై అపవాదికి కలిగిన శిక్షావిధికి లోబడకుండునట్లు క్రొత్తగా చేరినవాడై యుండకూడదు. మరియు అతడు నిందపాలై అపవాది ఉరిలో పడిపోకుండునట్లు సంఘమునకు వెలుపటివారిచేత మంచి సాక్ష్యము పొందినవాడై యుండవలెను". ఇదే అర్హతలు తీతు 1:5–9లో కూడ చెప్పబడెను. గనుక సంఘములోనున్న ప్రతివారు పెద్దలు కాజాలరు. అర్హత కల్గినవారే సంఘములో పెద్దలుగా నియమింపబడవలెను. అట్టివారు ఒకరికంటె ఎక్కువ మంది యుండవలెను. ఏ సంఘములోనయితే పెద్దలుగా నియమింపబడుటకు తగు అర్హత గలిగినవారు లేరో, అట్టివారు అర్హతలను పొంది పెద్దలుగా నియమింపబడు వరకు సంఘ పనులను అందున్న పురుషులు చక్కబెట్టవలెను.

పెద్దలతో కలిసి పనిచేయుటకు పరిచారకులను కూడ నియమింపవలెను. వారు సేవకులని పిలువబడుచు స్థానిక సంఘ పెద్దల నడిపింపుచొప్పున పనిచేయవలెను. వారికుండవలసిన అర్హతలను పౌలు ఇట్లనుడువుచున్నాడు: "ఆలాగుననే పరిచారకులు మాన్యులై యుండి, ద్విమనస్కులును, మిగుల మద్యపానాసక్తులును, దుర్లాభము నపేక్షించువారునైయుండక, విశ్వాస మర్మమును పవిత్రమైన మనస్సాక్షితో గైకొనువారై యుండవలెను. మరియు వారు మొదట పరీక్షింపబడవలెను; తరువాత వారు అనింద్యులైతే పరిచారకులుగా ఉండవచ్చును. అటువలె పరిచర్య చేయు స్త్రీలును మాన్యులై కొండెములు చెప్పనివారును, మితానుభవము గలవారును, అన్ని విషయములలో నమ్మకమైనవారునై యుండవలెను. పరిచారకులు ఏకపత్నీ పురుషులును, తమ పిల్లలను తమ యింటివారిని బాగుగా ఏలువారునై యుండవలెను. పరిచారకులై యుండి ఆ పనిని బాగుగా నెరవేర్చినవారు మంచి పదవిని సంపాదించుకొని క్రీస్తు యేసు

నందలి విశ్వాసమందు బహుధైర్యము గలవారగుదురు" (1తిమోతి 3:8-13).

ఇదిదైవికమైన సంఘ పరిపాలన పద్ధతి. ప్రతి స్థానిక సంఘము నందు పెద్దలు, పరిచారకులు ఉండగా క్రీస్తు దానికి శిరస్సై యున్నాడు. వారి అధికారము క్రిందనే బోధకులు, ఉపదేశకులు, సభ్యులు నడుచు కొనవలెను. ఇట్లుండగా ఏదైనా ఒక స్థానిక సంఘము అసత్య మార్గమునకు తొలగిపోయిన యెడల, మిగిలిన సంఘములు నమ్మకముగా యుండ వచ్చును. ఒకటి తప్ప అన్ని స్థానిక సంఘములు విశ్వాసము నుండి తొలగి పోయిన యెడల, ఆ ఒక్క సంఘమే నమ్మకముగా నుండ వీలగును. ప్రభువు దృష్టిలో ప్రతి స్థానిక సంఘము స్వయంపాలనను కలిగి, మిగిలిన వాటి నుండి స్వతంత్రత కలిగియున్నది. స్థానిక సంఘములన్నియు మానవ కల్పిత చట్టములతో గాక ప్రేమతో పరస్పరము బంధింపబడియున్నవి. అందువలన అవి ఒకదానితో నొకటి సహవాసము కలిగి, కలసి కృషి చేయును. ఏలయనగా అవి క్రీస్తునందు ఏకమై యున్నవి. దైవ మార్గము మనము అభివృద్ధి చేయలేము.

పేతురుగాని లేదా వేరొక మానవుడు గాని సంఘమునకు శిరస్సుగా నియమింపబడినట్లు లేఖములలో నీవు ఎక్కడను కనుగొనలేవు. ఒక బిషప్ అనేక సంఘములపై అధికారము కల్గినట్లుగాని లేదా "పాదిరి" సంఘనాయకునిగా యున్నట్లుగాని నీవు వాక్యమందు ఎన్నడును కనుగొనలేవు. సామాన్య సభ్యులు - గురువులు అను భేదములను కూడ నీవు కనుగొనలేవు. ఈనాడు క్రైస్తవులమని చెప్పుకొను "క్రైస్తవలోకము" దేవుడిచ్చిన స్థానిక సంఘపాలన పద్ధతి నుండి తొలగిపోయినది. అందువలన వారిలో వేలకొలది చీలికలు ఏర్పడినవి. గనుక సత్య సంఘము యొక్క పరిపాలన పద్ధతి ననుసరించుట కొరకు అన్ని విషయములలోను బైబిలు ననుసరించి నడుచుకొనుటకు మనము నిశ్చయించు కొందుము గాక.

-టి.పి.ఫోట్

# నేటి సాక్ష్యముల వెనుకయున్న సత్యము

నేటి క్రైస్తవులలో చిన్నచిన్న గృహ కూడికలు మొదలు పెద్ద పెద్ద బహిరంగ సభల వరకూ చాలాచోట్ల విభిన్న రూపాలలో సాక్ష్యములను విను చున్నాము. కేసెట్ల ద్వారా, సి.డి.లు, కరపత్రాలు, పుస్తకాలు, టి.వి.ల ద్వారా, ప్రసంగాల రూపాలలో వారివారి జీవితాలలోని సంఘటనలను సాక్ష్యము లుగా వినుచున్నాము. అయితే సాక్ష్యములను గూర్చి దేవుని చిత్తమేమిటో లేఖనానుసారముగా తెలియపరచుట ఈ వ్యాసము యొక్క ఉద్దేశ్యమై యున్నది.

ఒకవ్యక్తి సాక్ష్యము చెబుతూ తన పూర్వచరిత్ర అనగా వాని ఆర్థిక, ఆరోగ్య, విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం, రాజకీయం, దారిద్ర్యం, దాంపత్యం, కులం, మతం, తన విభిన్న దురలవాట్లు మొదలగు విషయాలను తెలియజేస్తూ దేవుని పట్ల ఎలా ఆకర్షితు లయ్యారో, క్రైస్తవునిగా మారిన తర్వాత ఎంత విజయవంతంగా జీవించగలుగు చున్నాడో తెలియజేస్తారు. ఈ విధమైన సాక్ష్యము చెప్పుటలో వారి ఉద్దేశ్యము - సాక్ష్యముల ద్వారా దేవుడు ఎంత గొప్పవాడో, ఎంత శక్తివంతుడో లోకానికి తెలియజేయుట, సాక్ష్యముల ద్వారా క్రైస్తవుల విశ్వాసాన్ని స్థిరపరచుట, అనేకు లను దేవునిలోనికి మార్చాలనే తాపత్రయం. అన్నిటినీ మించి దేవుని వాక్యముకన్నా వారి జీవిత సాక్ష్యముల ప్రభావమే మిన్న అని వారి ఉద్దేశ్యము. వారు చెప్పే ప్రతీదానికి తగిన ఆధారాలను వారు చూపగలరా? వారి సాక్ష్యము నమ్మదగినదో కాదో పరిశీలించే లేఖనములు బైబిలు గ్రంథంలో ఉంటాయా? వారిని పరీక్షించి తెలుసుకోవాలనే జిజ్ఞాస వినే క్రైస్తవులలో ఎందరికి ఉంటుంది? వినేవారు ఆలోచించాలి.

### సాక్ష్యము అనగా

సాక్ష్యము అనగా తెలుగు నిఘంటువు ప్రకారం "చూచిన దానిని, వినిన దానిని చెప్పునది". కోర్టులో మన

పక్షముగా సాక్ష్యము చెప్పేవారు వేరే వ్యక్తి అయి ఉండాలి. మనగురించి మనం చెప్పుకొనేది "స్వానుభవమే" గాని సాక్ష్యముకాదు. ఒకవ్యక్తిని పరిశీలిస్తున్న లోకం క్రైస్తవునిగా అతనిలో వచ్చిన మార్పును గూర్చి దేవుని ఘనపరచాలి (మత్తయి 5:16). వారి క్రియలే వారిని గూర్చి సాక్ష్యమిస్తాయి.

**సాక్ష్యము - బైబిలు నిర్వచనము**

i) క్రీస్తును కన్నులారా చూచి, చెవులారా విని, నిదానించి కొనుగొని, స్పర్శ ద్వారా తాకి చెప్పినది యదార్ధ సాక్ష్యము (1 యోహా 1:1-2). మరియు

ii) క్రీస్తునకు యెహోను బాప్తీస్మ మిచ్చిన దినము మొదలుకొని ఆయన ఆరోహణుడై పరమునకు చేర్చుకొనబడిన దినము వరకూ క్రీస్తుతో కూడా కలిసి జీవించిన వారు క్రీస్తుని గూర్చి చెప్పినదే సాక్ష్యము (అపొ.కా. 1:21-22). నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనిన యెడల నా సాక్ష్యము సత్యముకాదు (యోహాను 5:31).

**సాక్ష్యము చెప్పుటకు అర్హులెవరు?**

దేవునిని గూర్చి సాక్ష్యము చెప్పుటకు యేసుక్రీస్తు మరియు పరిశుద్ధాత్మ మాత్రమే అర్హులు.

క్రీస్తు గూర్చి సాక్ష్యమిచ్చుటకు దేవుడు, పరిశుద్ధాత్మ, ధర్మశాస్త్రం, ప్రవక్తలు, లేఖనములు, అపొస్తలులు, శిష్యులు మాత్రమే అర్హులు.

**దేవుడు** (1యోహా 5:9-10; యోహాను 5:37).

**క్రీస్తు** (1తిమోతి 6:13).

**పరిశుద్ధాత్మ** (యోహా 15:26; అపొ.కా. 5:31-32;20:23;హెబ్రీ 10:15).

**అపొస్తలులు; శిష్యులు** (లూకా 24:47-48; యోహా 3:11; 15:27; 21:24;

అపొ. 1:8;2:40;3-15;4:19,33;10:39; 22:15; 1పేతురు 5:1; 1కొరింధీ 15:15).

**ధర్మశాస్త్రం, ప్రవక్తలు** (రోమా 3:21-22).

**బైబిలు, లేఖనములు** (యోహాను 5:38-39).

**ఆయన క్రియలే ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చాయి** (యోహాను 5:36).

**వీరు దేనిని గూర్చి సాక్ష్యము చెప్పిరి?**

క్రీస్తు పునరుత్థానమును గూర్చి (అపొ. 2:32;4:33).

దేవుని రాజ్యమును గూర్చి (మత్తయి 24:14).

క్రీస్తు చేసిన క్రియలన్నిటిని గూర్చి (అపొ.కా. 10:39).

క్రీస్తు శ్రమలను గూర్చి(1పేతురు 5:1).

నిత్యజీవమును గూర్చి (1యోహా 1:2).

**సాక్ష్యమిచ్చుటకు ఆరంభ-అంత్యకాలములు ఉన్నాయా?**

క్రీ॥శ॥33 నుండి 95వ సం॥వరకు

క్రీస్తు ఆరోహణుడై పరమునకు చేర్చుకొనబడిన తరువాత అనగా క్రీ॥శ॥ 33వ సంవత్సరము నుండి యెరుషలేము మొదలుకొని యూదయ, సమరయ, భూదిగంతముల వరకూ క్రీస్తును గూర్చిన సాక్ష్యమును ప్రకటించాలని యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించి యున్నారు. (లూకా 24:47;అపొ.కా. 1:8). పునరుత్థానము తరువాత మొదటిసారిగా లోకానికి క్రీస్తును గూర్చి సాక్ష్యము చెప్పిన వ్యక్తి పేతురు (అపొ.కా. 2:40-42). దాని ఫలితంగా యెరూషలేములో పెంతెకొస్తను పండగ దినమున ఇంచుమించు మూడువేల మందితో సంఘస్థాపన జరిగినది. ఆ కాలములో యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలగడం వల్ల అందరూ యూదయ, సమరయ దేశములకు చెదిరిపోయి సువార్తను ప్రకటించుచూ సంచారము చేసిరి (అపొ.కా. 8:1-4).

క్రీ॥శ॥ 90-100 సం॥ల మధ్యకాలము నాటికి క్రీస్తును కన్నులారా చూచి, చెవులారా విని, నిదానించి కనుగొని, స్పర్శ ద్వారా తాకిన అపొస్తలుల, శిష్యుల శకం ముగిసినది. గ్రంథము పరిపూర్ణముగా వ్రాయబడినది. సువార్త సర్వలోకములో ఫలించుచూ వ్యాపించినది (కొల 1:6). క్రీస్తు ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పునొందెను. దేవదూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. ఆయన లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను (1తిమో 3:16). క్రీస్తు రక్షణ స్వాతంత్ర్యము వినిన వారిచేత

దృఢపరచబడెను (హెబ్రీ 2:4). ఇప్పుడు క్రీస్తుని గూర్చి సాక్ష్యమిచ్చుటకు క్రీస్తు సమకాలికులు భువిలోలేరు. ఇప్పుడు ఇతరులు సాక్ష్యములు చెప్పవలసిన, వినవలసిన అవసరంలేదు. కారణం దాని ఉద్ధేశ్యం, ఎప్పుడు, ఎక్కడ, ఎవరు, దేవునికోసం సాక్ష్యమివ్వాలో అది నెరవేరినది.

**ఇప్పటి క్రైస్తవుల పనియేమిటి?**

సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటన చేయాలి (మార్కు 16:15).

దేవుని రాజ్యమును ప్రకటించాలి (లూకా 9:60).

యేసే క్రీస్తని ప్రకటించాలి (అపో. 10:36; 1కొరింధీ 2:4).

సిలువను గూర్చిన వార్తను ప్రకటించాలి (1కొరింధీ 1:18,23).

సువార్తను ప్రకటింపని యెడల శ్రమ (1 కొరింధి 9:16).

దేవుని వాక్యము ప్రచురించుచూ ఉండాలి (అపో.కా. 17:13).

రక్షకుడని జనములలో ప్రకటించాలి (1 తిమో 3:16).

మన కొరకు కాకుండా క్రీస్తు యేసుకొరకు ప్రకటించాలి (2 కొరింధీ 4:5-6).

లోకాన్ని జీవము గల దేవుని వైపు త్రిప్పుట కొరకు ప్రకటించాలి (అపో.కా. 14:15).

సమయమందు, అసమయమందునూ సువార్త ప్రకటన చేయాలి (2 తిమో 4:2).

ఉన్న సమయమంతా సొంత సాక్ష్యాలకే ప్రాముఖ్యత ఇస్తే అసమయమందు కూడా ఎలా సువార్త ప్రకటన చేయగలం?

-పి. మణికుమార్, గొల్లపాలెం.

(సశేషం)

గమనిక:సత్యవాక్కు మీకు ఒకటి కంటె ఎక్కువ కాపీలు అందుచున్న యెడల దయచేసి వెంటనే మాకు తెలియజేయండి. మీ అడ్రసు పై నున్న నంబరును తప్పక వ్రాయండి.

## సాతాను యొక్క సింహాసనము - పెర్గము

## (Satan's Throne - Pergamos)

ప్రకటన 2:12-17

### పరిచయము:

1. పెర్గము పట్టణ జనాభా లక్షా అరవై వేలు. గాలెన్ అను ప్రసిద్ధ వైద్యుని వూరు అది. అస్క్లిపియోస్ అను దేవుని/దేవతతో సంబంధము గల వైద్య కేంద్రం అక్కడ వుండేది. ప్రజలు అక్కడకు వచ్చి రాత్రులు గడిపేవారు. ఆ గుడి ఆవరణములో విషము లేని సర్పములు తిరిగేవి. ఎవడైనా వాటిని తాకితే దేవుని తాకినట్లేయని భావించేవారు.
2. మిగతా దేవతలతో పాటు కైసరు చక్రవర్తి కూడ అక్కడ ఆరాధింపబడేవాడు.
3. పెర్గములో యున్న గ్రంథాలయములో రెండు లక్షలకు పైగా వివిధ గ్రంథములుండేవి.
4. చర్మపు కాగితములు ఇక్కడే కనుగొనబడెను.
5. ఇప్పుడు ప్రకటన 2:12-17 చూద్దాం.

**1. యేసు పెర్గము సంఘమును అభినందించుట (12,13 వచ).**

A. యేసు తన్ను గూర్చి వర్ణించుచు ఈ సంఘాన్ని అభినందించారు.

B. "ఆయన వాడియైన రెండంచులు ఖడ్గము గలవాడు".

రోమీయులు రెండంచులు గల ఖడ్గములను ధరించేవారు. అది వారి యొక్క అధికారానికి శక్తికి గురుతు. ఒకని రక్షించడానికి, శిక్షించడానికి వారికి అధికారమున్నది. క్రీస్తుకు ఇహపరముల యందు సర్వాధికారమున్నది (మత్తయి 28:18), ఆయన పునరుత్థానుడైనందున జీవన్మరణములపై ఆయనకు అధికారము కలదు. (ప్రక 1:17-18), దేవుని కుమారుని కున్న సర్వాధికారము యెదుట రోమా ప్రభుత్వ అధికారము శూన్యము (ప్రక 1:8;19:6).

C. "రెండంచులు గల వాడియైన ఖడ్గము" అను మాటలతో యేసు క్రీస్తు ప్రకటన గ్రంథంలో తరుచు పరిచయం చేయబడ్డారు (ప్రక 1:16;19:15). హెబ్రీ 4:12లో చెప్పబడినట్లు అదిదేవుని వాక్యము. దేవుని వాక్యము ఆత్మయొక్క ఖడ్గమై యున్నది. (ఎఫెసీ 6:17). పెంతెకొస్తునాడు పేతురు క్రీస్తు సువార్తను ప్రకటింపగా విన్నవారు తమ హృదయములలో నొచ్చుకొనిరి. మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుడియను అపొస్తలుల ఆజ్ఞకు మూడు వేల మంది లోబడిరి. వారు పాప క్షమాపణను, పరిశుద్ధాత్మయను వరమును పొందిరి. ప్రభువు సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2:37-38;41-47). స్తెఫను ఈ ఆత్మ ఖడ్గమునే వినియోగించాడు. వారతనిపై పండ్లు కొరకుచు, రాళ్లురువ్వి అతన్ని చంపిరి (అపొ.కా. 7:54-60). క్రీస్తు అదే ఖడ్గాన్ని తీర్పునందు వినియోగిస్తారు (యోహాను 12:48;రోమా 2:2; యోహాను 17:17).

D. వారు ఎక్కడ కాపురమున్నారో క్రీస్తు ఎరుగును. అదివారి స్థిరనివాసము. పెర్గము నుండి వారుపారిపోలేరు.

E. ఈ క్రైస్తవులు ఎక్కడ కాపుర మున్నారో! సాతాను సింహాసన మున్న స్థలములో వారున్నారు! సాతానుడు మానవుని అభూతకల్పన కాదు. అతడు వాస్తవంగాయున్నాడు! ఈ విశ్వంలో మనం గుర్తించదగిన 4వ వ్యక్తి అతడు. పెర్గము దుష్టత్వముతోను, పాపముతోను, విగ్రహారాధనతోను, అసత్యముతోను ఎంత నిండియున్నదంటే సాతానుడే అక్కడ తన సింహాసనము నేర్పరచు కొన్నాడు. అపవాదియు అతని దూతలును పరలోకము నుండి పడద్రోయబడిరి. భూమిని తమ నివాస స్థలముగా చేసికొనిరి (ప్రక 12:9). భూమిమీదయుండి సాతానుడు గోదుమల మధ్య గురుగులను విత్తుచుయున్నాడు. (మత్తయి13:24-30). మనుష్యులు దేవుని వాక్యమును విని రక్షింపబడ కుండా వారి హృదయములో నుండి

దేవుని వాక్యమును ఎత్తుకొనిపోవు చున్నాడు (లూకా 8:12).

F. సంఘము ఎట్టి ప్రదేశములో యున్నదో! వారు కుళ్లుపట్టిన సమాజము మధ్యనున్నారు. అయినను, ఆ పట్టణానికి కావలసిన వారు వీరే! క్రైస్తవులు ఈలోకమునకు ఉప్పుయి యున్నారు (మత్త 5:14-16). వారు ఈ లోకమందు జ్యోతుల వలె ప్రకాశించుదురు (ఫిలిప్పీ 2:15).

G. ఇటువంటి పట్టణంలో సంఘము మార్పు ఏమైవాతేగలదా? అవును, సాతానుడు సర్వశక్తిమంతుడు కాదు, సర్వజ్ఞాని కాదు, సర్వాంతర్యామి కాదు. మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవాని కంటె గొప్పవాడని యోహాను చెప్పాడు (1యోహా 4:4).

1. నా నామమును గట్టిగా చేపట్టి యున్నావని నేనెదుగుదును అని క్రీస్తు అన్నారు. వారు అస్కెలెపియోస్ అను దేవతను రక్షకుడని పిలువలేదు. కైసరు రక్షకుడని ఒప్పుకోలేదు. యేసు ప్రభువులకు ప్రభువు (యోహాను 4:42; ప్రక 17:14). క్రీస్తు నామమును ధరించుట ద్వారా ఈ క్రైస్తవులు ఆయన నామమును గట్టిగా చేపట్టియున్నారు. (1పేతురు 4:16). ఆయన అధికారమును గౌరవించుట ద్వారా దానిని గట్టిగా చేపట్టారు (కొలస్స 3:17). మనుష్యులలో ఇయ్యబడిన మరియే నామమున రక్షణలేదని వారికి తెలుసు (అపో.కా. 4:12).

I. నా యందలి విశ్వాసమును విసర్జింపలేదని నేనెరుగుదునని యేసు అన్నారు. క్రీస్తు యొక్క బోధను వారు విసర్జింపలేదు. సత్యవాక్యాన్ని సరిగానే విభజించేవారు. పరిశుద్ధులకు అప్పగింపబడిన విశ్వాసము కొరకు వారు పోరాడారు (యూదా:3). క్రొత్తనిబంధన వ్రాయబడు కాలంలో నేటి వలె అనేక 'విశ్వాసములు'లేవు. నాడు డినామినేషన్లు లేవు. క్రైస్తవులందరు ఏకమైయుండిరి. ఒకే విశ్వాసము కలిగియుండిరి. నేటి క్రీస్తు సంఘముల విజ్ఞాపన కూడ యిదే. మనం క్రీస్తును, ఆయన విశ్వాసాన్ని

విసర్జిస్తే, ఆయన మనలను విసర్జిస్తారు (మత్తయి 10:32-33; 2 తిమో 2:12).

J. తరువాత అంతిపయ అను సాక్షిని గూర్చి యేసు చెప్పారు. అతడు ఆయన యందు విశ్వాసియైయుండి, ఆయనను గూర్చి సాక్షియై వారి మధ్య చంపబడెను. క్రీస్తు అతని గూర్చి ఇక్కడ చెప్పారంటే అతడు ప్రత్యేకమైనవాడే. పరిశుద్ధుల పట్టికలో అతని పేరు చేర్చబడింది. అతడు ప్రభువు కొరకు తన ప్రాణములర్పించాడు. "మరణము వరకు నమ్మకముగా యుండుము నేను నీకు జీవకిరీటము నిచ్చెదనని" ప్రభువు ఇంతకు ముందే చెప్పారు (ప్రక 2:10). "తన ప్రాణమును దక్కించు కొనగోరువాడు దానిపోగొట్టుకొనును గాని నా నిమిత్తము తన ప్రాణము పోగొట్టు కొనువాడు దాని దక్కించుకొనునని" కూడా ప్రభువు చెప్పారు (మత్తయి 10:39).

II. క్రీస్తు యొక్క అభిశంసన (నిందారోపణ) (14-15వ)

A. పెర్గము సంఘమును క్రీస్తు కొంత నిందించారు. బిలాము బోధను అను సరించువారు దానిలో యున్నారు. బిలాము సంఘటనను సంఖ్యా కాండము 25:1-3;31:16;2 పేతురు 2:15-16లో చదువ గలము. మోయాబీయుడైన బాలాకు ఇశ్రాయేలీయులను శపించుటకు బిలామును ప్రోత్సహించాడు. గాని శపించుటకు బదులు అతడు వారిని దీవించాడు. నీవు దేవుని బిడ్డవైతే తప్పిపోలేవని అతడు వారికి బోధించియుంటాడు. అందువలన ఇశ్రాయేలీయులు బయలు దేవత పండుగకు హాజరయ్యారు. విగ్రహములకు బలి యిచ్చినవాటిని వారు తిని జారత్వము చేసారు. తత్ఫలితముగా 24 వేల మంది ఇశ్రాయేలీయులు చనిపోయారు.

B. బిలాము శోచనీయమైన వ్యక్తి. అవినీతిపరుడైనను నీతిపరునివలె మరణించగోరాడు (సంఖ్యా 23:10).

C. పెర్గములో దేవునితోను, సాతానుతోను సాంగత్యము చేయగోరువారున్నారు. అపో.కా. 15:28లో అపొస్తలులు అన్యజనాంగమునుండి క్రైస్తవులైన వారికిచ్చిన హెచ్చరిక యున్నది. వారు విగ్రహములకు అర్పించిన వాటిని, రక్తమును, గొంతుపిసికి చంపిన దానిని, జారత్వమును విసర్జింపవలెను. మనము దేవునికిని సిరికిని ఒకే సమయమందు దాసులుగా యుండ నేరమని యేసు చెప్పారు. అట్లుండ గోరువాడు ఒకని ప్రేమించి మరియొకని ద్వేషించును (మత్త 6:24). క్రైస్తవుడు లోకములో యున్నాడు గాని లోకము క్రైస్తవునిలో యుండకూడదు.

D. నికొలాయితుల బోధననుసరించిన్న వారు పెర్గము సంఘములో యున్నారని క్రీస్తు చెప్పెను. బిలాము బోధ, నికొలాయితుల బోధ ఒక్కటే నని కొందరంటారు. వీరిని గూర్చి మనకు సరిగా తెలియదు గాని క్రీస్తు వారిని ద్వేషించారు. వారు శరీర కార్యములను అనుసరిస్తు క్రీస్తును వెంబడించవచ్చు అని చెప్పేవారు. వారు దుష్టులు. పెర్గము క్రీస్తు సంఘములో యున్నవారు నికొలాయితుల అడుగుజాడలలో నడుచుకొనుచున్నారు. దానిని వారు అక్కడికక్కడే అంత మొందించాలి.

E. అందరు బిలాము బోధను నికొలాయితుల బోధను వెంబడించిన వారు కారు గాని వెంబడించేవారిని వారు అడ్డుకోలేదు. అట్టివారిని తమమధ్యవారు సహించారు. వారితో సహవాసము చేసారు! చెడ్డదానిని అసహ్యించుకోవాలి (రోమా 12:9). అసహ్యించుకొనడం అంటే దుష్టత్వాన్ని చురుకుగా ఎదుర్కొనుటయని అర్థం. మారుమనస్సుపొందని వారిని బహిష్కరించాలి (2 థెస్స 3:6). "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆబోధ

యందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు. ఎవడైనను ఈ బోధను తేక మీయొద్దకు వచ్చిన యెడల వానిని మీయింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పవద్దు. శుభమని వానితో చెప్పువాడు వాని దుష్ట క్రియలలో పాలలివాడగును" (2యోహాను: 9-11). పెర్గములో కొందరు ఈ హెచ్చరికను మన్నించ లేదు.

**III. ప్రతిఫలముల వాగ్దానము: (17వ)**

A. దేవుడు ప్రతిఫలములిచ్చు దేవుడు. తన్ను వెదుకువారికి ఆయన తప్పక ప్రతిఫలమిచ్చును (హెబ్రీ 11:6). మనలో ప్రతివానికి వానివాని క్రియల చొప్పున ఆయన ప్రతిఫలమిచ్చును (ప్రక 22:12). "జయించువానికి మరుగైయున్న మన్నాను భుజింపనితును". సన్నని కణముల వలె ఆకాశమునుండి ఇశ్రాయేలీయులకు దేవుడిచ్చిన ఆహారము మన్నా, రుచికి అది తేనె వలెనుండెను (నిర్గమ 16:15). క్రైస్తవులు ఈ లోకయాత్ర కొనసాగించుచుండగా వారి ఆత్మలకు అవుసరమైన ఆహారమును దేవుడు వారికిచ్చును. క్రీస్తే ఆ మన్నా యని యోహాను 6:31-34 బోధించుచున్నది. ఆయనే జీవాహారము.

B. "తెల్లని రాతి నిత్తునని" క్రీస్తు వాగ్దానము చేసెను. ప్రకటన గ్రంథములో తెల్లని వస్త్రములు, ధవళ (తెల్లని) సింహాసనములు, తెల్లని అంగీలు మొదలగువాటిని గూర్చి చదువగలము. విజయము సాధించిన యోధునికి తెల్లని రాతినిచ్చేవారు. న్యాయస్థానములో నిర్దోషిగా తీర్చబడిన వానికి కూడ తెల్లని రాతినిచ్చేవారు. విడుదల చేయబడిన బానిసకు కూడ అది ఇయ్యబడేది. తెల్లనిరాయి మనకియ్యబడిన ఆత్మీయ స్వాతంత్ర్యమును సూచించుచున్నది. మనము మరణము, పాపము దు:ఖము, వేదన ఏడ్పు, బాధలనుండి విముక్తి పొందుదుము (ప్రక 21:4). అది సాతానుపై మన విజయమునకు

సూచన (ప్రక 12:9-11).

C. జయించిన వానికి "ఒక క్రొత్త పేరుండును. పొందిన వానికే గాని అది మరి యెవనికిని తెలియదు". క్రొత్త కీర్తన, క్రొత్త యెరూషలేము, క్రొత్త ఆకాశము, క్రొత్త భూమిని గూర్చి ఈ గ్రంథములో మనము చదువుతాము. ఈ క్రొత్త పేరేమిటి? అది యెషయా 62:2లో ప్రవచింప బడిన క్రొత్తపేరు. అదే క్రైస్తవుడు అను క్రొత్తపేరు (అపొ.కా. 11:26; 1పేతురు 4:16).

D. ప్రకటన 3:12లో ఫిలదెల్ఫియలో నున్న సంఘమునకు క్రీస్తు "నా దేవుని పేరును, నా దేవుని పట్టణపు పేరును, నా క్రొత్తపేరును వాని మీద వ్రాసెదనని" చెప్పారు. "ఆయన నామము వారి నొసళ్లమీద యుండునని" ప్రకటన 22:4లో చెప్పబడినది. యిది దేవునితో గల సంబంధమును సూచించును.

**ముగింపు:**

క్రైస్తవుడు దుష్ట ప్రాంతములో కూడ నమ్మకమైనవాడుగా యుండగలడని నేర్చుకొన్నాము. ప్రభువు కొరకు జీవించకపోతే తీర్పునాడు మన పరిసరముల వారిని నిందించలేము. ప్రభువు కొరకు మనం ప్రాణమునైనా త్యాగం చేయవలసివచ్చును. అబద్ధ బోధకులకు, వారితో సహవసించువారిని క్రీస్తు సహించరని గ్రహించాము. సాతానుడు మన బద్ధశత్రువు. వానిని జయించువానికి దేవుడు తగిన ప్రతిఫలమిచ్చును.

-జాన్ ప్లేసి

గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు
50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.
SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001.

డేరిన్ కెన్నిడి, క్రిస్ లోమెన్ గార్లు కాకినాడ చేరుకొనిరి. అదే సాయంత్రం క్రొత్త కందరాడలో జరిగిన కూటములో వారు పాల్గొనిరి. అక్కడ యేసుదాసు గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

అక్టోబరు 21వ తేదీ శనివారం నాడు ట్రోటర్ గారు, డేరిన్ కెన్నడి గారు ఆచంట మండలం పెదగరువు, పెళ్లికూతురమ్మచెరువు, పెనుమంచిలి గ్రామములను దర్శించి వాక్యపరిచర్య చేసిరి. పెదగరువులో సోదరులు జి.సూర్య ప్రకాశరావు గారి సేవ ఫలితముగా 13గ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పెనుమంచిలో 4గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అక్కడ మానుకొండ జోసఫ్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. అమెరికా సోదరులతో జాషువా గూటం గారు కూడ వెళ్లి సువార్త సేవలో సహాయపడిరి.

అక్టోబరు 24వ తేదీ మంగళవారం నాడు కాకినాడ సత్యవాణి ఆవరణలో జరిగిన సువార్తికుల సదస్సుకు ఇంచుమించు 300మంది హాజరైరి. ఆసదస్సులో జిమ్ ట్రోటర్ గారు, డేరిన్ కెన్నెడీ గారు మంచి వాక్యపరిచర్య చేసిరి.

అక్టోబరు 25న జగన్నాధగిరిలోను, 26న సామంతకుర్రులోను, 27న వేళంగిలోను పైనుదహరించిన సోదరులు రిక్కీ గూటం గారితో కూడ వెళ్లి వాక్య పరిచర్యచేసిరి.

జగన్నాధగిరిలో పి.ప్రకాశంగారు, సామంతకుర్రులో N. ఏలియాగారు, వేళంగిలో శ్యామ్ ప్రసాద్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. అక్టోబరు 31వ తేదీ మంగళవారం నాడు ట్రోటర్ గారు, కెన్నెడీ గారు పెదపళ్లలో యున్న క్రీస్తు సంఘమును దర్శించి అక్కడ వాక్య పరిచర్య చేసిరి. జాషువా గూటం గారు కూడ ఆ కూటమునకు సతీసమేతముగా హాజరైరి. వాక్యపరిచర్య అనంతరం ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పెదపళ్లలో సోదరులు గుమ్మడి ఇశ్రాయేలు గారు వాక్య పరిచర్యచేయు చున్నారు.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు 'మా' టి.వి. లోను

ప్రతి గురువారం : 'విస్సా' ఛానల్ లో ఉదయం 7:00 గం॥లకు

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్ లోను చూడండి

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం

బ్రదర్. రిక్కీ గూటం

సత్యసువార్తను వినండి !!

మీబంధు మిత్రులకు విన్పించండి !!

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004